గ్లోబల్ హాస్పటల్ - ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక
కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన సామాజిక కథ

సరళారాణి ఒక్కసారి వులిక్కిపడింది. వెంటనే ఒక కథ రాయాలని ఆమె తహతహలాడిపోయింది. అదీ ప్రేమకథ వెంటనే రాయాలి. తను అందమైన ప్రేమకథ రాయగలనని నిరూపించుకోవాలి , క్షణాలలో ఆమె, తపన పట్టుదలై పెరిగి గట్టిపడింది.

# అపూర్వ ప్రేమ

ఇంద్రగంటి జానకీబాల

సరళారాణి పేరుమోసిన రచయిత్రి. ఆమె స్త్రీల పక్షం వహించి అనేక సమస్యల్ని చర్చిస్తూ మంచి కథలు నవలలు రాసి పేరు సంపాదించుకుంది. ఆమె తన అభిప్రాయాలను సూటిగా, ఘాటుగా చెప్తూ వ్యాసాలు రాసింది.

మగవారి దౌర్జన్యం, వారికి స్త్రీలపట్ల వుండే లోకువభావం, స్త్రీలను అణచివేయడానికి వారు వేసే వేషాలు, మోసాలు, అన్యాయాలు ఆమె ఏదీ వదలకుండా ఎన్నో రాసింది.

ఆమె కలంపట్టి రాసేనాటికే ఆమె మనసు కఠినమై పోయింది. ఆలోచనలో కసి పెరిగి పురుష సమాజం మీదికి పంజా విప్పిన పులిలా



తన రచనలతో దూకింది.


పదునైన రచనలు చేసింది. పేరు తెచ్చుకుంది. కానీ ఈవేళ ఆమెకి వున్నట్టుండి ఏదో గుబులు బయలుదేరింది. ఒక ప్రేమకథ రాయాలనిపించింది. తను లలితమైన ప్రేమభావాలను, ప్రణయకోపాలను, విరహతాపాలను రాయడంలో వెనుకబడి పోయాననే బాధ ఆమెని వేధించసాగింది. అందుకే వెంటనే ఒక ప్రేమకథ రాయాలని ఆవేశపడటం మొదలుపెట్టింది. ఒక అమ్మాయి, అబ్బాయి కలుసుకుని, ప్రేమించుకుని ప్రణయం సాగించిన కథ రాయాలని కాగితాలు, పెన్ను సిద్ధం చేసుకుని కూర్చుంది.


మొదట ప్రేమకథ రాయడానికి కావాల్సిన సరకు సరంజామా సమకూర్చుకుందామని పెన్ను తీసింది. వెన్నెల- పిల్లగాలి- దోసెట్లోకి తీసుకుని వాసనచూసే జాజిపువ్వులు- మంచులో తడిసిన మల్లెలు- పూలువాడినా పరిమళం వీడని పొగడ పూలదండ- కలువపూలు పూసిన చెరువు- తెల్లారగట్ట దారులంట రాలే కాడ మల్లిపూలు వెదజల్లే వాసనలు- ముద్దు ముద్దు మాటలు- అమాయకత్వపు అందాలు. ఆర్థిక ఇబ్బందులులేని అమ్మాయి, ఉద్యోగాన్వేషణ లేని అబ్బాయి, ఉల్లాసం, చిలిపితనం తప్ప సమాజం గొడవలేని వాతావరణం.

అన్నీ నోట్ చేసుకుని సిద్ధంగా పెట్టుకుంది. ఇవన్నీ అల్లుకుంటూ కథ రాయాలి,

పెన్ను కదలటం లేదు. కథ సాగటం లేదు. అనుకున్నంతలోనే కథ రాసేయగల అనుభవంగల రచయిత్రి ప్రేమకథ రాయాలంటే పదాలకోసం వెతుక్కుంటూ, వాక్యాలు కూర్చటంలో అవస్థ పడుతోంది. రాయడం, కొట్టేయడమేగానీ కథ కొంచెం కూడా ముందుకు సాగటం లేదు. ఒక రకమైన గుబులు, దుఃఖం ఆమె మనసునిండా గూడు కట్టుకోవడం మొదలుపెట్టాయి. తనేదో కోల్పోయాననే భావం ఆమెని బాధించడం మొదలుపెట్టింది.

***





## గ్లామరస్‌గా వుండటం అంటే?

ఏమిటని అడుగుతూంది 'లగాన్' హీరోయిన్ గ్రేసీసింగ్. అమితాబ్, అనిల్‌లతో చేసిన 'అర్‌మాన్' పెద్దగా నడవలేదు కానీ 'గంగాజల్'తో మాత్రం అందరి దృష్టిలోనూ పడింది. "అందరూ గ్లామరస్ అనే మాట వాడుతున్నారు. నాకు ఈ గ్లామరస్ పదానికి సరైన అర్థం తెలియటం లేదు. తొలి చిత్రంలో ఎలాంటి పాత్ర చేస్తే, అలాంటి పాత్రలే మళ్లీ ఇస్తుండటం సహజం. నాకిచ్చిన పాత్రలు చేయటంలో నాకు విచిత్రమైన సంతోషం కలుగుతున్నది. నాకు తెలిసిందంతే!' అంటున్నది గ్రేసీ. ఇదేమిటబ్బా?

తెలతెలవారుతున్నవేళ పూర్తిగా వెలుగు రాలేదు. కలనేత సిల్క్ బట్టలా గాలి కదులుతోంది. చల్లగా శరీరానికి హాయినిస్తోంది. మనసు ఉత్సాహంతో ఉరకలు వేసే సమయమది ఎవరికైనా.

సరళ చకచకా నడుస్తోంది. ఆమె ఆలోచనలు, ఆమె అడుగులూ ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నట్లుగా వుంది. రోడ్డుకి ఇరువైపులా కాడమల్లె పూలు రాలి వాతావరణం సుగంధభరితంగా ఉంది. రోజూ ఆ సమయంలో మార్నింగ్ వాక్ చెయ్యడం ఆమెకెంతో యిష్టం. ఆడపిల్ల పొద్దున్నే ఇలా వాకింగ్‌కి వెళ్లడం లాంటివి వాళ్లమ్మకి అంత ఇష్టం వుండదు. కానీ సరళ తల్లిని పెద్దగా పట్టించుకోదు. తండ్రి అవునూ అనడు. కాదూ అనడు.

ఆరోజు సరళ చకచకా నడుస్తోంది గానీ వుండుండి అడుగులు తడబడుతున్నాయి. మనసు లయ తప్పినట్టుగా వుంది. ఏదో ఉద్వేగం ఆమెను ఊపేస్తోంది. నిన్న ఇదే సమయంలో కనిపించిన అతని రూపం కళ్లల్లో నిలిచిపోయింది. పూర్తిగా వెలుగు లేకపోయినా అతని చూపుల్లోని మెరుపు స్పష్టంగా కనిపించింది.

అతనామెని చాలా రోజులుగా గమనిస్తూ వున్నాడేమో గానీ ఆమె మాత్రం అతన్ని నిన్నటివరకూ చూడలేదు. నిన్నటిరోజున అతను పలకరించిన తీరు తలుచుకున్న కొద్దీ మురిపెంగా వుంది.

పూర్తిగా విచ్చుకోని ఎర్రకలువమొగ్గ తెచ్చి, తన ఎదురుగా నిలబడ్డాడు. అతని పెదవులు కొంచెం కదిలాయి. కానీ మాటలు వినిపించ లేదు. ఒకే ఒక రేకు కాస్త విప్పి కలువమొగ్గ చేతికందించి వెళ్లిపోయాడు. రేకునంటిపెట్టుకుని చిన్ని కాగితం. ఆత్రంగా తీసి చదివింది

రేపు ఇదే సమయానికి మీకోసం ఎదురుచూస్తాను.

ఇప్పుడతను ఎక్కడ్నించి వచ్చి ప్రత్యక్షమవుతాడోనని ఆమె తడబడుతూ, పులకింతగా నడుస్తోంది. ఆమె రోజూ వెనక్కి తిరిగి పోయేచోట ఆగింది. అటూ యిటూ చూసింది. ఎదురుచూస్తానన్న ఆగంతకుడు తనే ఎదురుచూసేలా చేస్తున్నాడేమిటి అనుకుంది. ఆలస్యమేమిటి? అని ప్రశ్నించుకుంది.

ఇక్కడ ఆయనగారి కోసం పడిగాపులు పడాలని ఆశిస్తున్నాడా అని విసుక్కుంది. ఆ విసుగులో తెలియని మురిపెం వుంది.

అక్కడే వున్న పొన్నచెట్టు కింద కూర్చుంది. చెట్టు చుట్టూ పూలురాలి అందంగా వున్నాయి.

సరళ నెమ్మదిగా కాలిజోళ్లు తీసి పక్కనబెట్టింది. చల్లగా మెత్తగా అరికాళ్లకి గడ్డి తగులుతుంటే విచిత్రమైన అనుభూతి కలిగింది. అరచేత్తో గడ్డిమీద నెమ్మదిగా రాసింది. మంచు కరిగి నీరై అరచెయ్యి తడిగా అయింది. ఆ



### పూజాబత్రా పాడుతుందట!?

భారతీయనటీమణులు కెరీర్ ముందుకు నడవకపోతే పెళ్ళాడేసి స్థిరపడిపోతారు. విదేశాలకు వెళ్ళిపోతారు. కొంత కాలం తరువాత మళ్ళీ రంగంలోకి, అక్క, వదిన, తల్లి పాత్రలు చేసేందుకు తిరిగొస్తారు. బాలీవుడ్ నటి పూజాబత్రా కూడా ఆ పనే చేస్తున్నది. తనకు మోడలింగ్ ఏజెన్సీ విలోమినాలోనూ, 'బాంబే డ్రీమ్స్ ఆన్ బ్రాడ్ వే'లోనూ అవకాశా లొస్తున్నాయంటున్నది పూజ. అందుకు తను భారతీయయువతిలా కనిపించకపోవటం, తన పాటకు వారు ప్రభావితులు కావటం కారణాలట. అంత బాగా పాడుతుందా? ఇందాకా రెండు సార్లు స్వరపరీక్షలు జరిగాయట. హు!

చెయ్యి పెదవుల కానించుకుంది. అమృతం అంటే ఏమిటి? ఇదే కదా! చుట్టూ వరచుకున్న గడ్డికొసలు మంచుమొగ్గలు పూసినట్లున్నాయి. వడీవడని వెలుగుకి అవి మెరుస్తున్నాయి.

"నేనే ముందు రావాల్సింది, కానీ మీరు నాకోసం చూడటం ఆనందంగా వుంది." అన్నాడతనున్నట్టుండి. ఆమె ఆలోచనల్లోంచి బయటకొచ్చి-

"నాకేం ఆనందంగా లేదు" అంది నిస్పాటంగా.

"అయ్యో! ఇంత చక్కని వాతావరణంలో ఆనందం లేకుండా విషాదంగా కూర్చోటం కష్టమే"

అతని చమత్కారానికి నవ్వొచ్చింది.

"ఇంతకీ నాకోసం ఎందుకు చూస్తానన్నారు?"

"ఏం అనకూడదా?"

"మీరెవరో నాకు తెలీదు. నేనెవరో మీకు తెలీదు" అతనేం మాట్లాడలేదు. చిరునవ్వుతో, చేతిలో వున్న ఎర్రకలువ మొగ్గ ఆమె చేతికిచ్చాడు.

"ప్రబంధనాయకుడిలా కలువ మొగ్గ బాగుంది మీ చేతిలో" అంది చటుక్కున.

"ఏం చేస్తాం చెప్పండి? ప్రకృతి కదిలివచ్చి కవిత్వమై ఎదుట నిల్చుంటే"...

"ఆవండి. ఆవండి. అంతలేసి కవిత్వంగానీ పొగడ్తగానీ తట్టుకోలేను" అందామె కంగారుగా

అతను నవ్వాడు.

"నాపేరు శశాంక. మీ పేరూ తెలిస్తే బాగుంటుంది.

"ఎవరికి బాగుంటుంది" కొంటెగా అంది సరళ.

"ఇంకెవరికీ... నాకే" అన్నాడు.

"సరళారాణి"

"మీ పేరెంతో బాగుంది మీలాగా..."

ఆమె సమాధానం చెప్పలేదు.

గుట్టు బట్ట బయలుచేసినట్టు ఒక్కసారిగా వెలుగు నాలుగువైపులా పరచుకుంది.

***

అప్పట్నించీ రోజూ శశాంక, సరళారాణి మార్నింగ్ వాక్‌లో కలుసుకుని కబుర్లు చెప్పుకునేవారు. అప్పుడప్పుడు తొమ్మిదిగంటలకి బస్టాప్‌లో కలుసుకుని మాట్లాడుకునే వారు. ఇద్దరి మధ్యా స్నేహం, చనువూ పెరిగాయి.

ఏ ప్రోగ్రాము వేసుకున్నా వాక్‌లో మాట్లాడుకునేవారు. కాకపోతే బస్టాప్‌లో చిన్న చీటి ముక్కల ద్వారా సందేశాలిచ్చుకునేవారు. ఆఫీసుల్లో టెలిఫోన్లు వున్నా అవి అత్యవసరాలికే గానీ, ఆనందంగా కబుర్లు చెప్పుకోడానికి కాదు.

కొన్నాళ్ళకి ఇద్దరూ సాయంత్రాలు పార్కులోనో, రెస్టారెంట్‌లోనో కాలక్షేపం చేసేవారు.

మూడు నెలలు గడిచేసరికి ఇద్దరూ ఒకర్ని చూడకుండా మరొకరుండలేమన్నట్లుగా తయారయ్యారు.

అతనొచ్చే దారిలో ఎర్రకలువపూలు పూసే చెరువు గట్టుమీద ఇద్దరూ మౌనంగా కూర్చుని వాటినే చూసేవారు. కాడమల్లిపూలు జడలల్లుకుంటూ ఊహల్లో విహరించేవారు. తడితడి నేలమీద రాలిన నేరేడువళ్ళు ఏరుకుని తినేవారు. ఎవరైనా తమని గమనిస్తున్నారన్నా పట్టించుకోకుండా తలలెగరేసేవారు.

ఒక్కొక్కసారి మధ్యాహ్నం బయట భోజనాలకెళ్ళి ఏ.సి. హోటళ్ళల్లో ఏకాంత భాషణలు జరిపేవారు. మసక మసక చీకట్లో చేతులు పెనవేసుకుని రగిలిపోతూ రహస్యంగా ఒకరినొకరు తాకి అసంతృప్తికి గురయ్యేవారు.


ఆరోజు శశాంక కోరగా మధ్యాహ్నం ఆఫీసుకు శెలవుపడేసి అతనితో అతనుంటున్న గదికి వెళ్ళింది సరళ. నిజానికలా వెళ్ళగూడదని ఎన్నోసార్లు అనుకుంది. కానీ వెళ్ళకుండా నిగ్రహించుకోగల శక్తిని కోల్పోయింది. అతనితో మరింత చనువుగా, సన్నిహితంగా వుండాలని ఆమెకెంతగానో అనిపించింది.

ఇద్దరి మధ్యా అనుబంధం ఏర్పడటంతో ఒకరితో ఒకరికుండే మొహమాటం పోయింది. ఇద్దరికీ స్వేచ్ఛ పెరిగింది. శశాంక సరళమీద ఘాటైన ఛలోక్తులు విసిరేవాడు. సరళ అతనియందు తనకు గల సర్వాధికారాలూ ప్రదర్శించేది. అతను దగ్గరగా వస్తే, అతన్ని అతుక్కుపోవాలని చూసేది సరళ.

శశాంక ఒక్కోసారి ఆమెను విదిలించుకోవాలన్నట్టు చూసేవాడు. ఆమె అవమానపడేది. అతను లాలించేవాడు. మళ్ళీ మామూలే.

సరళలో వచ్చిన మార్పు వాళ్ళమ్మ కనిపెట్టి, అనుమానపడింది. నిలేసింది. సరళ పైకి గంభీరంగా తల్లిని తోసిపుచ్చి, దబాయించినా, మనసులో ఒక బెంగ బయలుదేరింది.

ఇద్దరూ నేలమీదకి దిగివచ్చి ఆలోచనలో పడ్డారు. అప్పుడే శశాంక చదువు అర్హతలు, అతను చేస్తున్న ఉద్యోగం, రాబడి, కుటుంబ భారం కులం అతనికున్న చెల్లెళ్ళు తండ్రిని కాదని, బయటకొచ్చి బతకగల శక్తిలేని శశాంక



స్థితి సరళకి అర్థమయ్యాయి. అన్నిటికీ మించి తనతో కష్టమైనా, సుఖమైనా పంచుకోవాలని లేదని గ్రహించిన సరళ విలవిల్లాడిపోయింది.

అతని మాటల్లో సీరియస్‌నెస్ లేకుండా కేవలం కాలక్షేపం, సరదా మాత్రమే వుండటం ఆమె కొంతదూరం వెళ్లాక సహించలేకపోయింది.

“పండిన దోసపళ్లలా నీ బుగ్గలు వేలాడుతుంటే ఏ మగాడికైనా కంట్రోలు చేసుకోవడం కష్టమే” అన్నాడొకసారి. ఆ మాటలు సరళకి ఎంతో వెగటు పుట్టించాయి. తనని అతను చూసిన దృష్టిలో ప్రేమ లేదా అని కలవరపడింది. అతనలా మాట్లాడ్డం అవమానంగా భావించింది.

“ఛీ! ఏమిటా మాటలు” అంది కోపంగా-

“ఛీ ఏముంది? ఇంకా నేను ఎంతో సున్నితంగా బుగ్గలనే అన్నా కానీ... నిజానికి అంటూ వెకిలిగా నవ్వుతుంటే అతన్నేం చెయ్యాలో తోచలేదు.

మాటల్లో స్పష్టంగా చెప్పేశాడు.

“పెళ్లీ గిళ్లీ పెట్టుకోకు. మానాన్న నా చర్మం వలిచేస్తాడు. మా వాళ్లందర్నీ ఎదిరించి వచ్చి నేను చేయగలిగిందేమీ లేదు.”

“నేను మగాడ్ని. నేను వుద్రేకపడినా నువ్వు కాస్త జాగ్రత్తగా వుండొచ్చు కదా! నాకంటే నువ్వే ఎక్కువ ఉబలాట పడ్డావనిపిస్తుంది.”

అంటూ అతను తప్పంతా సరళదే అన్నట్టు మాట్లాడుతుంటే ఆమె ఏం మాట్లాడలేకపోయింది. కసితో రగిలిపోయింది.

సరళ లోలోపల పడిన అనుమానం నిజమైంది. సమయం మించిపోయింది. డాక్టరు సలహాతో బయటపడే వీలు కూడా లేకుండా కాలం ముందుకెళ్లిపోయింది.

తల్లి సరళని విసిరి విసిరి కొట్టింది. తండ్రి అసహ్యించుకుని చావచితక్కొట్టాడు-

అతనెవరో చెప్పు. అతని కాళ్లు పట్టుకుని పెళ్లి చేస్తామన్నారు. కానీ సరళ కప్పుడతనంటే పరమ అసహ్యంగా వుంది. జీవితాంతం అతన్ని భరించడం నరకం అని గ్రహించింది.

తన కడుపు ఎలాగైనా పోవాలని ఎందరో దేవుళ్లని మొక్కుకుంది. ఒక్క దేవుడూ సరళ మొక్కులు స్వీకరించలేదు. అప్పుడే ఆమెకి దేవుడిమీద నమ్మకం పోయింది. జరిగేదాన్ని ఏ దేవుడూ ఆపలేడు మరింక దేవుడి ప్రస్తావన

**(తరువాయి 31వ పేజీలో)**


# పచ్చకామెర్లా?

జాండిస్ (పచ్చకామెర్ల వ్యాధి) కి ఖచ్చితమైన, సత్వర పరీక్షలు ఎంతో అవసరం!

**వీటిలో ఏ లక్షణాలతోనైనా బాధపడుతున్నారా?**

- కళ్ళు/చర్మం/మూత్రం పసుపుపచ్చగా ఉండటం
- తల తిరగడం / వాంతులు
- ఆకలి మందగించడం / బరువు తగ్గడం
- కడుపులో నొప్పి
- కాళ్ళు / పొట్టవాపు
- చలి, జ్వరం
- రక్తంతో కూడిన వాంతులు
- రంగులేని తెల్లని మలం
- దురదలు

కాలేయం
కోలోరెక్టల్
మూత్రపిండాలు
ఉదరం
ప్యాంక్రియాస్



EMERGENCY 24 Hrs SERVICE

నాటు వైద్యం, చిట్కావైద్యం ప్రాణాంతకం కావచ్చు

స్పెషలిస్టును సంప్రదించడం, చికిత్స చేయించుకోవడం ఒక్కటే సరైన మార్గం.

వెంటనే కాలేయ వ్యాధుల ప్రత్యేక వైద్య నిపుణులను (లివర్ స్పెషలిస్టు) సంప్రదించండి !!

EXCELLENCE THROUGH TEAM WORK

**జాండిస్ (పచ్చకామెర్లు) రావడానికి ప్రధాన కారణాలు :**

- హెపటైటిస్ ● వైరస్, మద్యం, మందులు, విషపదార్థాలు ● గాల్ బ్లాడర్ (పిత్తాశయం), పైత్యరసనాళం (బైల్ డక్టు) లో రాళ్ళు
- మెటబాలిక్, స్టోరేజి (జీవనక్రియ), పుట్టుకతో వచ్చే సమస్యలు ● కాలేయం, ప్యాంక్రియాస్, గాల్ బ్లాడర్‌ల కాన్సర్

**ఎన్నో ప్రత్యేకతలు కలిగినది గ్లోబల్ హాస్పిటల్:**

- నైపుణ్యత కలిగిన శస్త్రచికిత్స నిపుణులు ● ప్రత్యేక కాలేయ నిపుణులు (హెపటాలజిస్టులు)
- హాస్పిటల్ ఆవరణలోనే అన్ని వ్యాధినిర్ధారణ పరీక్షలు ● అత్యాధునిక ఆపరేషన్ థియేటర్‌లు / ఇన్‌టెన్సివ్ కేర్

**సంప్రదించండి ఫోన్ : 23234567**

అవయవాల మార్పిడి శస్త్రచికిత్సలకోసం ప్రత్యేకంగా దేశంలోనే ప్రప్రథమంగా ఏర్పాటైన గ్లోబల్ హాస్పిటల్స్ ఇప్పటికే కాలేయం, మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్సలు ఎన్నో విజయవంతంగా చేసింది.

**గుర్తింపు :**
**ఇ.ఎస్.ఐ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎ.పి. ట్రాన్స్‌కో, ఎఫ్.సి.ఐ ఎ.పి.జెన్ కో, సి.పి.డి.సి.ఎల్, బి.డి.ఎల్, ఎన్.ఎం.డి.సి**

**గ్లోబల్ హాస్పిటల్స్**
అత్యున్నత వైద్య సేవల కోసం సమిష్టి కృషి

**సి.జి.హెచ్.ఎస్, ఆరోగ్య భద్రత, దక్షిణమధ్య రైల్వే, ఎన్.టి.పి.సి, సింగరేణి కాలరీస్ మరెన్నో ప్రముఖ సంస్థలు**

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజి, లివర్ డిసీజస్, రీనల్ డిసీజస్, ల్యాప్రోస్కోపిక్ సర్జరీ, కోలోరెక్టల్ సర్జరీ, అంకాలజీ, జాయింట్ రీప్లేస్‌మెంట్ అండ్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్

లకడీకాపూల్, హైదరాబాద్ - 500 004 ఫోన్: 040 - 23244444 (10 లైన్లు) ఫ్యాక్స్ : 23244455 వెబ్ సైట్ : www.theglobalhospital.com

TIME & SPACE

(27వ పేజీ తరువాయి)

ఎందుకు? అనుకుంది.

తన పినతల్లి కూతురు రాంచీలో వుంటే ఆమె దగ్గరికి సరళని పంపడానికి తల్లి నిర్ణయించింది. కాదనే శక్తి, మార్గం సరళకి లేకుండా పోయాయి.

టెంపరరీగా చేస్తున్న ఉద్యోగం ఆ విధంగా పోయింది-

సరళ అమ్మని, నాన్ననీ, ప్రేమనీ, ఆ వూరునీ వదిలిపెట్టింది.

ఆడపిల్ల పుట్టింది. సరళ మనసు రాయయిపోయింది. పిన్ని సాయంతో నెమ్మదిగా మళ్లీ మనిషైంది. సరళకి చిన్నప్పటినుంచీ పదునైన ఆలోచన వుంది. ఆ ఆలోచన అక్షర రూపం యిచ్చే ప్రయత్నం మొదలుపెట్టింది.

ఆమె రచనలు పదునుగా సాగాయి. ఆమెలోని ఆవేదనా, పదునైన వ్యక్తీకరణ, నిజాయితీ అందర్నీ ఆకట్టుకున్నాయి. చాలా తక్కువ కాలంలోనే ఆమెకి మంచి రచయిత్రిగా పేరొచ్చింది- ఎవర్నీ లెక్కచేయని ఆమె ప్రవర్తన కూడా ఒక ఆకర్షణైంది.

అన్ని విషయాలు దాచి పెళ్లిచేస్తానని వచ్చిన తల్లిని నిజంగా చెప్పు తీసుకుని కొట్టింది.

ఆమె భావాలు, ఆమె స్వేచ్ఛా ప్రవర్తన చూసిన మగవాళ్లు ఆమెతో సన్నిహితంగా వుండాలని చూస్తే, వాళ్లని తన చుట్టూ తిప్పుకోవడం, వున్నట్టుండి వదిలేయడం లాంటి పనుల్లో ఎంతో ఆనందాన్ని అనుభవించేది.

తనకి చాలా డబ్బుండాలి. తనచుట్టూ అందరూ కుక్కల్లా తిరగాలి అంటూ కసిగా ఆలోచించేది. డబ్బును పక్కనపెట్టి ప్రేమకబుర్లు ఎప్పుడూ చెప్పేది కాదు. ప్రతీదానికీ ఒక విలువ వుంటుంది. ప్రపంచంలో తొంభై విషయాలమీద డబ్బుతోనే కొలుస్తాం అంటూ నేను మాత్రం వంద విషయాలూ డబ్బుతోనే కొలుస్తా అంటూ నవ్వేది.

ఆమె చుట్టూ చేరినవాళ్లు అవును. అవును నిజం నిజం అంటూ తాళం వేసేవారు.

వెనుక ఆమె క్యారెక్టర్ గురించి గుసగుసలాడినా ఎదురుగా ఆమె కనిపిస్తే అందరూ ఆమెకోసం పడి చచ్చిపోయేవారు. ఆ పడిచచ్చిపోయేవాళ్లని ఆమె ఎప్పుడూ నిర్లక్ష్యం చేసేదికాదు.

సరళారాణి ఎన్నో మంచి రచనలు చేసింది. పేరు తెచ్చుకుంది. అవార్డులు గెలుచుకుంది.

తన బిడ్డకి తండ్రి ఎక్కడున్నాడనే విషయాన్ని పూర్తిగా వదిలేసింది. తనే అన్నీ అయి పెంచుతోంది. ఎక్కడ? తనకి వేలమైళ్ల దూరంలో బోర్డింగ్ స్కూల్లో.

మగాడు ఆడదాన్ని మోసం చెయ్యడం ఏమిటి? అలాంటిదేమీ లేదని వాదించేది. ఎవరి స్వభావాన్నిబట్టి వారు ప్రవర్తిస్తారు. ఆ ప్రవర్తనకి లింగబేధం లేదని బల్లగుద్ది చెప్పేది. ఒక్కొక్కసారి ఆమె పురుషుల్ని సమర్థిస్తోందో, వ్యతిరేకిస్తోందో అర్థంకాక తికమకపడేవారు- అయితే సరళారాణి మరొక మగాడి భార్యగా లేకపోవడంతో ప్రతీ మగాడూ ఆమెతో చనువుగా వుండటానికి ప్రయత్నించేవాడు. దాన్ని సమర్థించడానికి స్త్రీ స్వేచ్ఛ గురించి వుపన్యాసాలు దంచేవారు. చాలామంది సరళారాణిలో వున్న లోపలి ప్రపంచాన్ని అర్థం చేసుకోలేక పోయేవారు. తన లబ్ధి పొందడానికి మాత్రమే 'ప్రేమ' అనే మాటను కొంత భరించేది. ఒక్కొక్కసారి కోపంతో ఊగిపోయి, ప్రేమ వట్టి ట్రాష్ అనేది.

మొత్తానికి ఆమెకి 'ప్రేమ' అనే మాటన్నా, ఆ భావనన్నా చాలా అసహ్యమని చాలా కొద్దిమంది అర్థం చేసుకున్నారు.

ఆమెకిప్పుడు ఒక కారుంది. రెండు ఫ్లాట్లున్నాయి. ఎప్పుడూ చేతిలో సెల్‌ఫోన్ రంగు రంగుల, రకరకాల ఫ్యాషన్ డ్రస్సుల్లో ఆమె ఎక్కడ కనిపించినా కాస్త సంచలనమే.

కాగితాలమీద చేతులానించి నిద్రలోకి జారిపోయిన సరళారాణి వులిక్కిపడి లేచింది. సెల్‌ఫోన్ ఇంగ్లీష్ మ్యూజిక్ ఆగకుండా వినిపిస్తూంటే దాన్నందుకుని,

'హలో' అంది

అవతలవైపు నుంచి వచ్చిన అభ్యర్థన శ్రద్ధగా వింది.

"ఈవెనింగ్ పంపించండి. ఇస్తాను" అని పెట్టేసింది.

ముఖం కడుక్కుని, వేడిగా టీ తాగి కూర్చుని కథ రాసేసింది. కథనిండా సెల్‌ఫోన్ కాల్స్- ఎస్.ఎమ్.ఎస్‌లు, మిస్డ్ కాల్స్- ఈ మెయిల్ డిస్‌కషన్స్- చైనా చాయ్ తాగడాలు విమాన ప్రయాణాలు, ఎయిర్‌పోర్టులోని ఎస్కలేటర్లు- చిన్ననాటి కాడమల్లి పూలవాసన గుర్తుచేసే రూమ్ ఫ్రెషనర్స్- కాగితాలతో రాకెట్ విమానాలు చేసి విసిరినట్టు నిజాం విమానం ఎక్కినప్పుడు కుదిపిన జ్ఞాపకాలు- అన్నీ ఎంతో అధునాతంగా అమరాయి కథలో,

కథ అచ్చయింది ఆ రాత్రి ఒక మిత్రుడు ఫోను చేసి పలకరిస్తూ-

"ఏమిటా పిచ్చి ప్రేమకథ చెత్తగా వుంది. అన్నీ వున్నాయందులో ప్రేమకి కావల్సిన అమాయకత్వం, ఆర్ద్రతా తప్ప. నీదికాని విషయం నీకెందుకు చెప్పు" అన్నాడు.

సరళారాణి స్థాణువులా వుండిపోయింది.

ఏమిటీ? ప్రేమ నాది కాదా! నాది కాదా! అంటే ప్రేమ అనే అనుభూతిని వ్యక్తీకరించడానికి తనకి అర్హత లేదూ? ఏమిటీ వీళ్ల అభిప్రాయం?

చాలా ఏళ్ల తర్వాత సరళారాణి కళ్లల్లో సన్నటి కన్నీటి పొర కమ్మింది.

మళ్లీ మ్యూజిక్ మొదలుపెట్టిన సెల్‌ఫోన్ పీక వెంటనే నొక్కి 'హల్లో' అంది భారంగా.

'అమ్మా' అవతలి వైపు నుంచి అమృతం చిలకరించినట్టుగా-

"అవూ" అంటూ అరిచింది సరళ.

ఆమె గొంతులో వేయి ప్రేమ సముద్రాల ఘోష వెల్లువై ఆమెను ముంచేసింది.

ప్రేమ- ప్రేమ- ప్రేమ-

ఇక్కడే వున్న ప్రేమను మరెక్కడో వెదికితే ఎలా దొరుకుతుంది?

కూతురు అపూర్వతో మాట్లాడుతుంటే సరళారాణి హృదయం ప్రేమాంతరంగమై పులకరించింది. ■

